క్లుప్తంగా

కేసీ కెనాల్ కాల్వలో పూడిక తీయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలో ఉన్న కేసీ కెనాల్ కాల్వలో పూడిక తీయాలని ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బూల్ బాష పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు కేసీ కెనాల్ ప్రాంత అధికారి మహబూబ్ బాషకు ఆర్‌సీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని దుర్గమ్మ గుడి నుంచి , అయేషా నగర్, అగాడి వీధి, ఖలీల్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో కేసీ కెనాల్ కింద ఆక్రమణలు జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి సకాలంలో కాల్వలో పూడిక తొలగించాలని కోరారు. కార్యక్రమంలో జనతాదళ్ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు ఆచారి పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్‌లో చదివే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప ప్రకాష్‌నగర్‌లోని చంద్రమౌళి పాఠశాల ఆవరణంలో ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలలుగా మెస్ చార్జీలు విడుదల కాలేదన్నారు. ఫలితంగా హాస్టల్ వార్డెన్స్ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించలేక అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ సలీం



సుబ్బలక్షుమ్మ నుంచి ప్రిన్సిపాల్ బాధ్యతలు స్వీకరిస్తున్న సలీంబాషా

వైవీయూ : కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపాల్‌గా డా. వేమల సలీంబాషా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పూర్వపు ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. అనంతరం పలువురు అధ్యాపకులు నూతన ప్రిన్సిపాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బీఎస్ రావుకు ఘన నివాళి



బీసీ రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జూనియర్ కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావు మృతి బాధాకరమని శ్రీచైతన్య జూనియర్ కళాశాల డీఎస్ విజయ భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్ నాగరాజు అన్నారు. శుక్రవారం కడపలోని శ్రీ చైతన్య కళాశాలలో బీఎస్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్ రావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఓలు మనోజ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునస్వామి, వైస్ ప్రిన్సిపాల్ రాజా, శివప్రసాద్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు నగరంలోని ఆర్‌ఐవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేసి ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలలో ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీహరి, ఫరూక్, తేజ, మహేష్ పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీకి అడ్డుకట్ట



పైపులైన్‌కు మరమ్మతులు చేసిన దృశ్యం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని బళ్లారి రోడ్డులో టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగాతా తాగునీటి పైపులైన్ లీకేజీ ఏర్పడింది. ఈ విషయంపై ఇటీవల 'సాక్షి' వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన నగరపాలక సిబ్బంది పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. తమ సమస్య పరిష్కారం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'జగనన్న సురక్ష' పేదలకు వరం

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు



సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మరింత మేలు జరుగుతుందని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ కె. సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక 36, 37, 50 డివిజన్లలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో వారు పాల్గొని, సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం ప్రజలకు చేరువ అయ్యాయన్నారు. మిగిలిన ఒక్క శాతంలో ఎవరైనా అర్హులు ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వారికి మేలు చేకూరుస్తున్నామన్నారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి ప్రజలకు అవసరమైన సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని జగనన్న సురక్ష శిబిరాల్లో పరిష్కరిస్తున్నారన్నారు. కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు తదితరాలకు సంబంధించి 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్ బి. నిత్యానందరెడ్డి, 36, 50, 37 డివిజన్ల ఇన్‌చార్జులు మహమ్మద్ రఫీ, కె. రాజశేఖర్‌రెడ్డి, బసవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, షఫీ, మియ్యా, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

– జగనన్న సురక్ష ప్రజలకు ఒక వరమని 12వ డివిజన్ కార్పొరేటర్ సానపురెడ్డి శివకోటిరెడ్డి, 30వ డివిజన్ కార్పొరేటర్ టి. విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి అన్నారు. శుక్రవారం స్థానిక ఫక్కీరుపల్లె, నాగరాజుపేటలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో వారు పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి సిఫారసులు లేకుండా పారదర్శకంగా పథకాలు ఇంటి వద్దకే వెళ్లి అందించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలోతహసీల్దార్ శివరామిరెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, కో ఆప్షన్ సభ్యురాలు బండి మరియలు, సాబీరా పాల్గొన్నారు.

పార్కు నిర్మాణానికి భూమిపూజ



పార్కు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని అగాడి వీధిలో నూతనంగా నిర్మించనున్న పార్కుకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు భూమిపూజ చేశారు. శుక్రవారం పార్కు నిర్మాణానికి టెంకాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ పార్కు అగాడి, సాయిపేట, వక్కలపేట ప్రాంతాల ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుందన్నారు. పార్కు పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 36వ డివిజన్ ఇన్‌చార్జి రఫీ, బంగారు నాగయ్య యాదవ్, మియ్యా, గోపాలక్రిష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన ఉండాలి



సాయిపేట మున్సిపల్ పాఠశాలలో టీచర్లతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం స్థానిక సాయిపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. 35 శాతం సమయాన్ని ఆటపాటలకు కేటాయించాలని తెలిపారు. అంతకుముందు మార్నింగ్ విజిట్‌లో ఆయన 31వ డివిజన్ బ్రాహ్మణ వీధి, 45వ డివిజన్ ఊటుకూరు, 46వ డివిజన్ శాస్త్రినగర్ ప్రాంతాలను పరిశీలించారు. పాత కంపోస్టు యార్డులో అమర్చిన తూకం వేసే యంత్రాలను పరిశీలించి, సీసీ కెమెరాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. క్లాప్ వాహనాలు టన్ను కంటే తక్కువ తూకం ఉంటే మళ్లీ డివిజన్‌లోకి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వార్డు సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

విద్యార్థులు జ్ఞానసముపార్జనకు ప్రాధాన్యత ఇవ్వాలి

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకునేందుకు అవసరమైన జ్ఞానసముపార్జన చేయాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలో జంతుశాస్త్ర విభాగం, మైక్రోబయాలజీ శాఖలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ కళాశాలకు నిర్దేశించిన సమయానికంటే ముందుగా చేరుకోవాలని, గ్రంథాలయాన్ని, ఇతర వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రాక్టికల్స్ గురించి, వసతిగృహ సమస్యల గురించి ఆరాతీశారు. విద్యార్థులకు అసౌకర్యం తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు.

సత్వర సేవలను అందించాలి..

విద్యార్థులకు సత్వర సేవలు అందించేలా పరీక్షల విభాగం పనిచేయాలని వీసీ ఆదేశించారు. విశ్వవిద్యాలయంలో పరీక్షల విభాగాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు సర్టిఫికెట్స్ మంజూరు చేయడంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం పరీక్షల విభాగంలోని ఫైళ్లను పరిశీలించారు. దీంతో పాటు ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలను ఆయన పరిశీలించారు. పరీక్షల నియంత్రణ అధికారులు డా. ఆదినారాయణరెడ్డి, డా. సుమిత్ర పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం

ఏఫ్‌యూ: ఇస్రో ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా శుక్రవారం చేపట్టిన చంద్రయాన్-3 లాంచింగ్ ప్రక్రియ విజయవంతం కావడం పట్ల డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, మన శాస్త్రవేత్తల మేధస్సుకు తార్కాణంలా నిలిచిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో భారతదేశం, ఇస్రో మరిన్ని విజయాలు సొంతం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిధుల వినియోగంపై శిక్షణ తరగతులు

వైవీయూ : పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ విధానం (పీఎంఎఫ్ఎస్) ద్వారా జాతీయ సేవాపథకం నిధుల వినియోగం పారదర్శకంగా ఉంటుందని పీఎంఎఫ్ఎస్ రాష్ట్ర అధికారి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ నిధులను వినియోగదారులకు, ఇతర ఖాతాలకు ఎలా జమచేయాలో అవగాహన కల్పించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎస్. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ నూతన విధానం ద్వారా ఒక క్రమపద్ధతిలో నిధులను వినియోగించడమే కాకుండా పారదర్శకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైవీయూ పరిధిలోని 121 యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన సాంకేతిక శిక్షణ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో రెండు వారాల పాటు చేపట్టిన సాంకేతిక శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ పాలెం నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తూ ఉత్తమ బోధనకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే ఉన్నత పాఠశాలల్లో స్మార్ట్ టీవీలతోపాటు డిజిటల్ క్లాస్‌రూమ్ ద్వారా విద్యా బోధనను అందిస్తుందన్నారు. ఇక్కడ ఇచ్చిన శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో పిల్లలకు బోధించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి రమణమూర్తి, సంయుక్త కోఆర్డినేటర్లు రమణ, ఇమామ్‌ఖాసీం, కేఎస్ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రత్నమ్మ, కళాశాల సాంకేతిక నిపుణులు వెంకటరమణ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



కమలాపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మదిలో నుంచి పుట్టుకొచ్చిన జగనన్న సురక్ష.. అనే కార్యక్రమం పేద ప్రజలకు రక్ష.. అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎర్రగుడిపాడు, కమలాపురం 4వ వార్డు సచివాలయాల్లో జరిగిన జగనన్న సురక్ష క్యాంప్‌లో లబ్ధిదారులకు ఆయన 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేసి మాట్లాడారు. ఇప్పుడు రాష్ట్ర బడ్జెట్ ఎంత ఉందో, చంద్రబాబు హయాంలో కూడా అంతే ఉండేదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నాలుగేళ్లలో ప్రజలకు రూ. 3.65 లక్షల కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా జగనన్నకు ఓటేయాలని ఆయన కోరారు. ఏపీపీఎస్సీ బోర్డు మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ మార్పూరి మేరి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చిందన్నారు. అలాంటి వారిపై ప్రతిపక్షాలు నిందలు మోపడం సరికాదన్నారు. ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, చెన్నకేశవరెడ్డి, వెంకట లక్షుమ్మ, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, మహ్మద్ సాదిక్, నిఖిల్‌రెడ్డి, కొండారెడ్డి, దేవదానం, దస్తగిరి, జెట్టి నగేష్, ఏడీఏ నరసింహారెడ్డి, ఎంపీడీఓ చలపతి, తహసీల్దార్ సరస్వతి, కమీషనర్ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు చెప్పుకో దగ్గ ఒక్క పథకాన్ని ప్రజలకు అందించక పోవడంతోనే ప్రజలు ఆయనను తిరస్కరించారన్నారు. అనంతరం ప్రజలకు ఉచితంగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి, ఏపీఐఐసీ మెంబర్ రజనీకాంత్‌రెడ్డి, సర్పంచ్ చెన్నమ్మ, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఓబీ సుబ్బారెడ్డి, కూలూరు ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, నారాయణరెడ్డి, ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, ఏవో సాయిజ్యోతి, ఎంఈవో లిల్లెమ్మ, ఏపీవో పార్థ సారధి పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పెంట సచివాలయంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రజలకు వార్డు, సచివాలయాల ద్వారా మెరుగైన సేవలను అదిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు, విద్యార్థులకు 11 రకాల సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల సలహాదారు రాజోలి వీరారెడ్డి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యాక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఈడిగ కార్పొరేషనర్ డైరెక్టర్ కృష్ణయ్య, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ నారే నాగరాజు, యూత్ అధ్యక్షుడు గజ్జల ఈశ్వర్‌రెడ్డి, మల్లిఖార్జున యాదవ్, సుబ్బరాయుడు, వర్దిరెడ్డి సురేంద్రారెడ్డి, పల్లా పెంచల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బీసీ సెల్ నాయకుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై మెలకువలు పాటించాలి



మాట్లాడుతున్న కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి డ్రైవర్ ఇంధన పొదుపుపై జాగ్రత్తలు పాటించాలని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో కడప రీజియన్‌లో అత్యల్ప ఇంధన పొదుపు, ప్రమాద రహిత డ్రైవింగ్‌పై శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు డ్రైవింగ్ సమయంలో రోడ్లపై సిగ్నల్స్‌ను గమనించి డ్రైవింగ్ చేయాలన్నారు. అలాగే సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, డ్రంక్ అండ్‌డ్రైవ్ పనులకు దూరంగా ఉండాలన్నారు. అలాంటి వాటిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ సీఎంఈ లక్ష్మీభాస్కర్ మాట్లాడుతూ కేఎంపీఎల్ పెరిగేందుకు పంచ సూత్రాలను వివరించారు. ఈ సూత్రాలను ఏ డ్రైవర్ పాటిస్తారో వారికి మంచి కేఎంపీఎల్ వస్తుందని తెలిపారు. పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ , రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డి, కడప డిపో ఎస్‌డీఐ రామయ్యలు మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటించడం , ఓవర్ టేక్‌లపై రోడ్డు డైవర్షన్, జాగ్రత్తలు, ఇంధన పొదుపు, మెలకువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



హైదరాబాదు వెళ్లి పింఛన్ అందజేత



నాగశేషు నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ శ్రవణ్య (ఫైల్)

కడప నగరం ఆలంఖాన్‌పల్లె 1వ సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న శ్రవణ్య ప్రతినెలా 1వ తేదీ ఉదయమే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పింఛన్ అందిస్తోంది. గతనెల జి.నాగశేషు అనే దివ్యాంగునికి పెన్షన్ అందించాల్సి వచ్చింది. అయితే ఆయన ఆరోగ్యం సరిలేక హైదరాబాదు మణికొండలోని మిషన్ వాక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. దీంతో వలంటీర్ శ్రవణ్య సొంత ఖర్చులతో హైదరాబాదు వెళ్లి నాగశేషుకు పింఛన్ మొత్తం అందించారు. వలంటీర్ సేవా భావానికి అందరూ ముగ్దులయ్యారు. అంకితభావంతో.. సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న ఆమెను పలువురు ప్రశంసిస్తున్నారు. – కడప సెవెన్‌రోడ్స్

తోబుట్టువులా వచ్చి...



మాది ఆలంఖాన్‌పల్లె. ఆరోగ్యం క్షీణించడంతో మిషన్ వాక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వికలాంగ పింఛన్ తీసుకోవడానికి రాలేకపోయాను. విషయం గ్రహించిన వలంటీర్ శ్రవణ్య సొంత తోబట్టువులా సొంత ఖర్చులతో హైదరాబాదు వచ్చి పింఛన్ అందించడం చాలా ఆశ్చర్యానికి లోనయ్యాను. మా వలంటీర్ శ్రవణ్య అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం.

–నాగశేషు, కడప

వరదలు వచ్చినపుడు ఆదుకున్నారు



యల్లయ్య నుంచి ఈకేవైసీ తీసుకుంటున్న వలంటీర్ విశ్వనాథ్ (ఫైల్)

2020లో కడపలో కురిసిన భారీ వర్షాల వల్ల చాలా ప్రాంతాలు జలమయం అయ్యాయి. మా ప్రాంతంలో కూడా పెద్ద ఎత్తున నీరు నిలిచాయి. ఆ సమయంలో అధికారులతో కలిసి వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివి. ముఖ్యంగా ఎవరి ఇళ్లలో నీరు చేరింది. ఎవరికి వరదల వల్ల నష్టం జరిగిందనే విషయాలను వలంటీర్లు అధికారులకు తెలిపి నష్ట పరిహారం వచ్చేలా చేశారు. అప్పట్లో వలంటీర్లు అందించిన సేవలను ఈ ప్రాంత వాసులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు. ఇంటింటికీ వచ్చి ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయం, సరుకులు ఎంతో ఉపయోగపడ్డాయని చెబుతున్నారు. – కడప కార్పొరేషన్

కుటుంబ సభ్యుడిలా సేవలు



అకస్మాత్తుగా వరదలు వచ్చి ఇళ్లన్నీ మునిగిపోయాయి. వీధుల్లో, ఇళ్లలో పెద్ద ఎత్తున బురద పేరుకుపోయింది. వాటిని శుభ్రపరచడంలో మా వలంటీర్ విశ్వనాథ్ ఎంతో సాయం చేశాడు. ఆ బురదలోనే మాకు బియ్యం, అన్నం ప్యాకెట్లు, మందులు తెచ్చి ఇచ్చాడు. అన్నీ ఇంటికి తెచ్చి ఇచ్చినా ప్రతిఫలంగా ఏమీ ఆశించేవాడు కాదు.

– యల్లయ్య, రామాంజనేయపురం

హస్తకళలు, కళాకారులను ఆదరిద్దాం



వస్త్రాలను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి

కడప కల్చరల్ : హస్తకళలు, కళాకారులను ఆదరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి అన్నారు. శ్రీ కళాజ్యోతి హస్తకళల సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో హస్తకళా రూపాలు, చేనేతల ప్రదర్శన, అమ్మకాల స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. సంస్థ మేనేజర్ వెంకయ్య ఆయనకు అన్ని స్టాల్స్‌ను చూపించి వాటిలోని వస్తువుల గురించి వివరించారు. ప్రధానంగా ధర్మవరం, పోచంపల్లి, మంగళగిరి, బెంగాలి చీరలు, కలంకారి, ఆభరణాలు, కొయ్య బొమ్మలు, మెటల్ బొమ్మలు, అలంకార సామాగ్రిని ఆయన తిలకించి కళాకారుల నైపుణ్యాన్ని మెచ్చుకున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే జగనన్న లక్ష్యం

– ప్రజా దర్బార్‌లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల/రూరల్ : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కనంపల్లె గ్రామంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రజా దర్బార్ నిర్వహించారు. గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలో తాగునీటి పైపుల పనులు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి జగనన్న కాలనీలో తాగునీటి పైపులైన్ పనులు త్వరితగతిన ఏర్పాటు చేయాలని, అలాగే మౌలిక సదుపాయాలు వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రతి ఇంటికి నీటి కొళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేయాలన్నారు. గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మండల పరిధిలోని కనంపల్లె, మోట్నూతలపల్లె గ్రామాల్లో యురేనియం ప్రాజెక్టు ఫేజ్-2 కింద భూములు పోయే అవకాశం ఉందని.. మా భూములకు పట్టాలు ఇప్పించాలని గ్రామ రైతులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన తహసీల్దార్‌తో మాట్లాడి గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయన ప్రజల సమస్యలు విని వినతులు స్వీకరించారు. కనంపల్లె గ్రామానికి చెందిన యువకులు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎంపీ దృష్టికి తీసుకరాగా.. యూసీఐఎల్, ఎస్ఎంఎస్ కంపెనీ, న్యూటెక బయోసైన్సెస్ కంపెనీల సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారిని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బలరామిరెడ్డి, పుష్పనాథరెడ్డి, ఓబుళరెడ్డి, కనంపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని రాజారెడ్డివీధికి చెందిన ఆదిమూలపు సుబ్బరాయుడు అదృశ్యమయ్యాడని వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి తెలిపారు. ఆయన కథనం మేరకు... బేల్దారి పని చేసి జీవిస్తున్న రంగస్వామి ఈనెల 10వ తేదిన తన ఇంటిలో కూలీలకు డబ్బులు ఇవ్వాలని చెప్పి బయటికి వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదన్నారు. ఈ మేరకు అతని భార్య దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.